
సాక్షి పశ్చిమగోదావరి

సోమవారం । 10 । ఏప్రిల్ । 2023



ఉత్సాహంగా టెక్ జైట్-23

నూజివీడు ట్రిపుల్ ఐటీలో సాంకేతిక సంబరం టెక్ జైట్-23 ఆదివారం ఉత్సాహంగా కొనసాగింది. కోడింగ్, డీ కోడింగ్, ఏఐ తదితర అంశాలపై వివరించారు. 8లో



30 నుంచి బ్రహ్మోత్సవాలు

ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాలు ఈనెల 30 నుంచి ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల 7 వరకు జరుపుతారు. 8లో



15 బైక్‌లు స్వాధీనం

మోటార్ సైకిళ్లను దొంగిలించిన నిందితుడిని అరెస్ట్ చేసి రూ.7 లక్షల విలువ చేసే 15 మోటార్ సైకిళ్లను మొగల్తూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సోమవారం సాయంత్రం)	సహరి (మంగళవారం వేకువజాము)
భీమవరం	6.25	4.30
తాడేపల్లిగూడెం	6.27	4.38
నరసాపురం	6.25	4.29

న్యూస్‌రీల్

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



శ్రీవారి ఆలయంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావుకు స్వామివారి మెమెంటో అందిస్తున్న ఆలయ ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జున రావు ఆదివారం ఉదయం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, దేవస్థానం ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు స్వామివారి మెమెంటో, ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట భీమడోలు కోర్టు జడ్జి టీఎస్ఎస్ రామ ఆదిత్య రిషిక్ తదితరులున్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఏపీ హెచ్ఈఆర్ఎంసీ చైర్‌పర్సన్



శ్రీవారి ఆలయంలో ఏపీ హెచ్ఈఆర్ఎంసీ చైర్‌పర్సన్ వెంకట రమణకు స్వామివారి మెమెంటోను అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రాన్ని ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ, మానిటరింగ్ కమిషన్ చైర్‌పర్సన్ జస్టిస్ ఎం.వెంకట రమణ ఆదివారం ఉదయం సందర్శించారు. ముందుగా సతీసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం అధికారులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో ఆయనకు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు శ్రీవారి మెమెంటోను, ప్రసాదాలను అందజేశారు.

హత్య చేసి కాలువలో పడేశారు



చిలకంపాడు వెంకయ్య కాలువలో లభించిన నరసింహస్వామి మృతదేహం

పెనుమంట్ర: పెనుమంట్ర మండలం నెలమూరుకు చెందిన కేతా నరసింహస్వామి(30) నిడదవోలు మండలం తాళ్లపాలెంలో హత్యకు గురై పెంటపాడు మండలం చిలకంపాడు వెంకయ్య కాలువలో శవమై తేలినట్లు పెనుమంట్ర ఎస్సై బి.సురేంద్ర కుమార్ తెలిపారు. నరసింహస్వామి భార్య శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించామని ఎస్సై తెలిపారు. ఈ నెల 5న నరసింహస్వామి కనిపించడం లేదంటూ ఫిర్యాదు చేశారు. దీంతో దర్యాప్తు చేస్తుండగా వెంకయ్య కాలువలో శవం వచ్చినట్లు సమాచారం అందిందన్నారు. శవాన్ని పరిశీలించగా నరసింహస్వామిగా గుర్తించినట్లు తెలిపారు. హత్యకు చేసినట్లు గుర్తించామని, హత్యకు ఆర్థిక లావాదేవీలే కారణమని భావిస్తున్నట్లు తెలిపారు. శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమవరానికి చెందిన బొక్కా రాజేష్, పోతురాజు వెంకటేశ్వరరావు అలియాస్ వెంకట్, ఆకుల ఆదినారాయణ, మంతెన గోపాల్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

బడి తెరిచిన రోజే విద్యాకానుక

- పక్కా ప్రణాళికతో విద్యాశాఖ ఏర్పాట్లు
- ఇప్పటికే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు
- ఉమ్మడి పశ్చిమలో మొత్తం 2,66,958 మంది విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తోంది. ముఖ్యమంత్రి జగనన్న విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. సీఎం జగనన్న మానస పుత్రిక అమ్మ ఒడితోపాటు మన బడి, నాడు - నేడు, గోరుముద్ద, విద్యాకానుక, విద్యా దీవెన, వసతి దీవెన ఇలా అనేక విద్యా సంబంధిత పథకాలు ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తూ పేదలకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. మరో విద్యా సంవత్సరం త్వరలోనే ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులందరికీ జగనన్న విద్యాకానుక అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సిద్ధమవుతున్న జగనన్న విద్యాకానుక

పేద విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం నింపి, వారికి విద్య ద్వారానే ఉన్నతి సాధ్యమని నమ్మకాన్ని కలిగించి కేవలం చదువుపైనే దృష్టిపెట్టేలా చేయడమే సీఎం జగనన్న లక్ష్యం. దీనిలో భాగంగా జగనన్న విద్యాకానుకగా విద్యార్థులకు యూనిఫాంతో పాటు విద్యా సామగ్రి అందజేయడానికి ఏర్పాట్లు చేశారు. ఏటా క్రమం తప్పకుండా పంపిణీ చేస్తున్న విద్యాకానుకను ఈ ఏడాది కూడా పాఠశాలలు తెరిచిన రోజునే వారికి అందజేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. ఈ మేరకు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల వ్యాప్తంగా ప్రతి విద్యార్థికీ విద్యాకానుక అందించేందుకు సిద్ధం చేస్తున్నారు.

బడి తెరిచిన రోజే పంపిణీ

మూడేళ్లుగా జగనన్న విద్యాకానుకను బడి తెరిచిన రోజే విద్యార్థులందరికీ అందజేసేందుకు చర్యలు తీసుకున్నారు. డిసెంబర్ లేదా జనవరి నుంచే విద్యార్థుల వివరాలు సేకరించడంతో పాటు వారికి అందించే బూట్లు, యూనిఫాం కొలతలు సేకరించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన తరువాత నూతనంగా పాఠశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు కూడా విద్యా కానుక అందించేందుకు విద్యాసామగ్రిని సిద్ధంగా ఉంచుతున్నారు.



విద్యా కానుక కిట్లు అందజేస్తున్న దృశ్యం (ఫైల్)

పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య

ముఖ్యమంత్రి అమలు చేస్తున్న విద్యారంగ అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ప్రైవేట్ పాఠశాలల నుంచి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్న తల్లిదండ్రుల సంఖ్య ఏటా పెరుగుతోంది. 2020-21 విద్యా సంవత్సరంలో ఏలూరు జిల్లాలో 1,22,654 మందికి సుమారు రూ.18.77 కోట్ల విలువైన విద్యాకానుకలు అందజేశారు. 2021-22లో 1,39,229 మంది విద్యార్థులకు రూ.21.30 కోట్ల విలువైన విద్యా కానుకలు, 2022-23లో 1,87,051 మంది విద్యార్థులకు రూ. 37.33 కోట్ల విలువైన విద్యాకానుకలు అందజేశారు.



1,60,536 మంది విద్యార్థుల గుర్తింపు

2023-24 విద్యా సంవత్సరంలో ఏలూరు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్న 1,60,536 మంది విద్యార్థులను గుర్తించారు. వీరికి విద్యాకానుక అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీరిలో 78,341 మంది బాలురు, 82,195 మంది బాలికలు ఉన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో మొత్తం 1,06,422 మంది విద్యార్థులున్నారు. వీరిలో బాలురు 51,762 మంది, బాలికలు 54,660 మంది ఉన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి మొత్తం 2,66,958 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక పంపిణీ చేయనున్నారు. వీరికి మూడు జతల యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్స్, 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు నోట్ పుస్తకాలు, రెండు జతల సాక్స్, జత బూట్లు, బెల్టు, స్కూల్ బ్యాగ్, 1 నుంచి 6వ తరగతి వరకు చదివే విద్యార్థులకు డిక్షనరీలు అందజేస్తారు.

ప్రతిపాదనలు పంపించాం



పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో బడి తెరిచిన రోజే జగనన్న విద్యాకానుక అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రతిపాదనలు పంపించాం. 6వ తరగతి విద్యార్థులకు అందించే ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు జిల్లాకు చేరుకున్నాయి. మిగిలిన విద్యా సామగ్రి వచ్చిన వెంటనే మండల కేంద్రాలకు పంపిస్తాం. వచ్చే విద్యాసంవత్సరంలో జగనన్న విద్యాకానుక పంపిణీకి ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నాం.

– ఎన్‌వీ రవి సాగర్, ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి

నరసాపురం-యశ్వంత్‌పూర్ సర్వీసు పునరుద్ధరించాలి

ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



నరసాపురం : గతంలో ట్రయల్ రన్‌గా నిర్వహించిన నరసాపురం-యశ్వంత్‌పూర్ మధ్య రైలు సర్వీస్‌ను తిరిగి పునరుద్ధరించాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కోరారు. ఈ మేరకు ముదునూరి ఆదివారం రైల్వేశాఖ మంత్రి అశ్వని వైష్ణవ్‌జీకి లేఖ రాశారు. గత ఏడాది నరసాపురం-యశ్వంత్‌పూర్ మధ్య రైలు సర్వీస్‌ను ప్రయోగాత్మకంగా నడిపారని లేఖలో గుర్తు చేశారు. ఆ సర్వీసు విజయవంతంగా నడిచిందని, ఆ సర్వీస్‌ను పునరుద్ధరించడమే కాకుండా పర్మినెంట్ చేయాలని కోరారు. మైసూర్ వరకూ కూడా సర్వీస్‌ను పొడిగిస్తే ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. విద్యార్థులు, ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్, బెంగుళూరు, మైసూరు వెళ్లే లక్షలాదిమంది భక్తులకు ఉపయోగంగా ఉంటుందని చెప్పారు. అలాగే నరసాపురం-విజయవాడ డబ్లింగ్ పనులు కూడా పూర్తయ్యి, సర్వీస్‌లు నడుస్తున్న నేపథ్యంలో ఈ రూట్‌లో కొత్త సర్వీస్‌లు ప్రవేశపెట్టే విషయంలో ఇబ్బందులు లేని కారణంగా రైల్వేశాఖ దృష్టి పెట్టాలని కోరారు. వీలైనంత త్వరగా బెంగళూరు-యశ్వంత్‌పూర్ సర్వీసును పునరుద్ధరించాలని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కోరారు.

రాష్ట్రంలో ఆదర్శవంతమైన పాలన

జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో చీఫ్ విప్ ముదునూరి



జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం కార్యక్రమంలో భాగంగా 13వవార్డులో వలంటీర్లు, గృహసారథులతో కలసి నడుస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి

నరసాపురం: దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శవంతమైన పాలన సాగిస్తున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం కార్యక్రమం నరసాపురం పట్టణంలో ఉత్సాహంగా సాగుతోంది. పట్టణంలోని 31 వార్డుల్లో కార్యక్రమం ప్రారంభమైంది. వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ప్రతి ఒక్కరితో మాట్లాడారు. 13వ వార్డులో జరిగిన కార్యక్రమంలో వలంటీర్లు, గృహసారథులతో కలిసి చీఫ్ విప్ ముదునూరి తిరిగారు. ఏ ఇంటిలో ఏ ప్రభుత్వ పథకాలు వస్తున్నాయో వివరించారు. ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలు తీసుకుని, వారి అనుమతితో ఇళ్లకు స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నాలుగేళ్లలో అమలు చేసి ప్రజల వద్దకు వెళుతున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ మన భవిష్యత్, మన నమ్మకం అనే భావన అందరిలో ఉందన్నారు. జగన్‌కు అండగా నిలిచి, మళ్లీ వచ్చే ఎన్నికల్లో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని, ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేస్తున్నాయని అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, జడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల, యూత్ అధ్యక్షుడు బూసరపు జయ, దొంగ మురళీకృష్ణ, చదలవాడ మెర్లిన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అనాథ బాలికలకు అండగా..



తాడేపల్లిగూడెం మండలం దండగర్రలో బాలికలతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: తల్లిదండ్రులను కోల్పోయి వారు అనాథలుగా మారారు. నాన్నమ్మ వద్ద కాలం వెళ్ళదీస్తున్నారు. నాన్నమ్మ వృద్ధురాలు కావడంతో ఆ ముగ్గురు అమ్మాయిల భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. ఆదివారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తాడేపల్లిగూడెం మండలం దండగర్రలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆ అమ్మాయిల పరిస్థితి చూసి చలించిపోయారు. కొండపల్లి శ్రీనివాస్ - వెంకటలక్ష్మి దంపతులు అనారోగ్యంతో మృత్యువాత పడ్డారు. వారి ముగ్గురు కుమార్తెలు గంగ, వైష్ణవి, అంజలిలు నానమ్మ గంగారత్నం వద్ద ఉంటున్నారు. ఆర్థిక పరిస్థితి సరిగాలేక చదువులు మధ్యలోనే మానేసి ఇంటి వద్దే ఉంటున్నారు. వారికి ఆసరాగా నిలవాలని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ భావించారు. గంగకు నన్నయ్య యూనివర్సిటీ క్యాంపస్‌లో ఉద్యోగం కల్పించడంతో పాటు చదువు మధ్యలో ఆపేసిన అంజలి, వైష్ణవిలను హాస్టల్‌లో చేర్పించి చదివించాలని అధికారులకు ఆదేశించారు. తల్లిదండ్రులకు సంబంధించి బీమా మొత్తం వచ్చేలా చర్యలు తీసుకుంటానని భరోసానిచ్చారు.

గుబ్బల మంగమ్మకు ప్రత్యేక పూజలు

బుట్టాయగూడెం: మండలంలోని కామవరం అటవీ ప్రాంతంలో కొలువై పూజలందుకుంటున్న గుబ్బల మంగమ్మతల్లి గుడికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతోపాటు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా భక్తుల తరలివచ్చి మంగమ్మ తల్లికి పూజలు చేశారు.



భీమవరం : పట్టణంలోని సమాధుల వద్ద ప్రార్థనలు



ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఏలూరు అమలోద్భవి కథిడ్రల్‌లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు, ఇతర ఫాదర్లు

ఘనంగా ఈస్టర్ వేడుకలు

క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఆదివారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఏసుక్రీస్తు మరణాన్ని జయించి తిరిగి లేచిన రోజున తెల్లవారుజామున తమ వారి సమాధులను అలంకరించి ప్రార్థనలు నిర్వహించారు. చర్చిల్లో ఈస్టర్ సందేశాన్ని వినిపించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఆకివీడు : వెలంపేటలోని క్రైస్తవ సమాధుల వద్ద పూజలు చేస్తున్న దృశ్యం



తణుకుకల్చరల్ : ఈస్టర్ సందర్భంగా వేల్పూరులోని సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు



తాడేపల్లిగూడెం : పోలీసు ఐలాండ్ ప్రాంతంలో ఈస్టర్ ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు



కాళ్ల : మండలంలోని ఏలూరుపాడు సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న విశ్వాసులు



పెనుగొండ : మండలంలోని ఇలపర్రులో ఈస్టర్ ప్రార్థనలు

క్లుప్తంగా

ఘనంగా శ్రీలక్ష్మీ గణపతి హోమం



శ్రీ లక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీక్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సంకటహర చతుర్థి సందర్భంగా శ్రీ లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. ఆలయ అభిషేక పండిట్ భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో 11 మంది దంపతులు ఈ హోమంలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ భక్తులకు స్వామివారి శేషవస్త్రంతో పాటు ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం పూజలో పాల్గొన్న భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

షాపులో బ్యాటరీల చోరీ

ద్వారకాతిరుమల: స్థానిక కుంకుళ్లమ్మ ఆలయ సమీపంలోని ఇన్వర్టర్స్ సేల్స్, రిపేర్ షాపులోని బ్యాటరీలు శనివారం రాత్రి చోరీకి గురయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి షాపులోకి చొరబడి ట్యూబ్లర్ బ్యాటరీలు 3, ట్రాక్టర్ బ్యాటరీలు 5, బైక్ బ్యాటరీలు 20, ఇన్వర్టర్లు 5 చోరీ చేశారు. వీటి విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని, దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు రాజా తెలిపాడు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

చాట్రాయి: అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. మండలంలోని పోలవరం గ్రామానికి చెందిన తాణంకి పుల్లయ్య (90) ఆదివారం సాయంత్రం 6 గంటలకు తన ఇంట్లో మంచం మీద పడుకుని మృతి చెందాడు. అయితే ఆ సమయంలో ఇంట్లో ఉండాల్సిన బంగారం, నగదు పోయినట్లు గుర్తించడంతో వాటి కోసమే వృద్ధుడిని హత్య చేసి ఉండవచ్చనే అనుమానం వ్యక్తమవుతోంది. మృతుడి కుమారుడు సర్వేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్సై కె.ప్రతాప్‌రెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనుమానస్పదంగా మృతి చెందినట్లు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

30 నుంచి చినవెంకన్న బ్రహ్మోత్సవాలు

- మే 4న రాత్రి శ్రీవారి తిరుకల్యాణం, 5న రథోత్సవం
- వివరాలు వెల్లడించిన ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు



శ్రీవేంకటేశ్వర స్వామివారు



ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో శోభకృత్ నామ సంవత్సర వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాలు ఈనెల 30 నుంచి ప్రారంభం కానున్నాయి. వైఖానస ఆగమ శాస్త్రాన్ని అనుసరించి పాంచాహ్నిక దీక్షతో ఈ ఉత్సవాలను వచ్చేనెల 7 వరకు అత్యంత వైభవోపేతంగా జరుపనున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు శనివారం వెల్లడించారు. ఉత్సవాలు జరిగే రోజుల్లో శ్రీవారికి ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రామోత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 30 నుంచి వచ్చేనెల 7 వరకు ఆలయంలో స్వామివారికి నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను రద్దు చేస్తామన్నారు. బ్రహ్మోత్సవాలను వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరావాలని ఆయన కోరారు.

ఉత్సవ విశేషాలివీ..

- ఈనెల 30న ఉదయం శ్రీవారిని పెండ్లి కుమారునిగా, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా చేయడంతో ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. ఆ రోజు రాత్రి 7 గంటల నుంచి గజవాహనంపై గ్రామోత్సవం జరుగుతుంది.
- వచ్చే నెల 1న రాత్రి 7 గంటల నుంచి అంకురార్పణ, రుత్విగ్వరణ అనంతరం బ్రహ్మోత్సవాల వీక్షణకు సర్వాది దేవతలను ఆహ్వానించే క్రమంలో ధ్వజారోహణను నిర్వహిస్తారు. రాత్రి 9 గంటల నుంచి హంసవాహనంపై గ్రామోత్సవం జరుగుతుంది.
- 2న ఉదయం 7 గంటల నుంచి సూర్యప్రభ వాహనంపై, రాత్రి 7 గంటల నుంచి చంద్రప్రభ వాహనంపై గ్రామోత్సవం జరుగుతుంది.
- 3న ఉదయం 7 గంటల నుంచి హనుమద్వాహనంపై గ్రామోత్సవం, రాత్రి 7 గంటల నుంచి బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టమైన ఎదుర్కోలు ఉత్సవం జరుగుతుంది. రాత్రి 8.30 గంటల నుంచి వెండి శేషవాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరుగుతుంది.
- 4న రాత్రి 8.30 గంటల నుంచి శ్రీస్వామివారి తిరుకల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. అనంతరం వెండి గరుడ వాహనంపై గ్రామోత్సవం, అలాగే అదే రోజు ఉదయం 7 గంటల నుంచి సింహ వాహనంపై గ్రామోత్సవం జరుగుతుంది.
- 5న రాత్రి 7.30 గంటల నుంచి క్షేత్ర పురవీధుల్లో రథోత్సవం జరుగుతుంది.
- 6న ఉదయం 10.30 గంటల నుంచి చక్రవారి–అవభృథోత్సవం, మధ్యాహ్నం 3 గంటల నుంచి వేద సభ, రాత్రి 7 గంటల నుంచి పూర్ణాహుతి, మౌనబలి, ధ్వజావరోహణ, రాత్రి 8 గంటల నుంచి అశ్వవాహనంపై గ్రామోత్సవం జరుగుతుంది.
- 7న ఉదయం 9 గంటల నుంచి చూర్ణోత్సవం, వసంతోత్సవం జరుగుతాయి. అలాగే రాత్రి 7 గంటల నుంచి ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగం–పవళింపుసేవ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

శ్రీవారి సేవలో విజిలెన్స్ ఎస్పీ కుమార్



శ్రీవారి ఆలయంలో పూజలు చేస్తున్న విజిలెన్స్ ఎస్పీ కుమార్

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రాన్ని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.కుమార్ ఆదివారం సందర్శించారు. ముందుగా ఆయన కుటుంబ సమేతంగా స్వామివారి నిత్యార్జిత కల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం శ్రీవారు, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఆ తరువాత ఆలయ ముఖ మండపంలో పండితులు ఆయనకు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికారు. అనంతరం చినవెంకన్న మెమెంటో, ప్రసాదాలను అందజేశారు.

పాము కాటుకు వ్యక్తి మృతి

కాళ్ల: కలవపూడిలో పాము కరిచి ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొల్లాటి నాగేశ్వరరావు ఆదివారం ఇంటి వద్ద భోజనం చేస్తుండగా తాచుపాము ఎడమ చేతి వేలిపై కాటేసింది. భార్య స్థానికుల సాయంతో అతనిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్సై ఏజీఎస్ మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడపగడపకు సంక్షేమం



తణుకు అర్బన్: తణుకు రెండో వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



తాడేపల్లిగూడెం రూరల్: దండగర్రలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

ఒకరి పేరుతో మరొకరు పరీక్షకు హాజరు

ఓపెన్ స్కూల్ విద్యార్థులు 8 మందిపై కేసు నమోదు

పాలకొల్లు సెంట్రల్: ఒకరి పేరుతో మరొకరు పదో తరగతి పరీక్షలు రాస్తున్న నలుగురిపై, అసలు విద్యార్థులు నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే స్థానిక సుభాష్ చంద్రబోస్ ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్‌లో శనివారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నారు. శనివారం ఇంగ్లిష్ పరీక్ష సందర్భంగా ప్రశ్నాపత్రాలను అందించిన తరువాత విద్యార్థుల హాల్ టికెట్‌లను ఇన్విజిలేటర్లు తనిఖీ చేస్తుండగా 1, 3, 4, 5 రూమ్‌లలో నలుగురు విద్యార్థులకు బదులుగా వేరే నలుగురు పరీక్షలు రాస్తున్నట్లు గుర్తించారు. దీనిపై ఇన్విజిలేటర్లు వెంటనే సూపరింటెండెంట్‌కు సమాచారం ఇవ్వడంతో ఆ నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. అసలు విద్యార్థులు జి.శ్రీనివాసరావు పేరున రాపాక ప్రమోది, రాజేశ్వరి పేరున క్రాపా అనూష, బాలాజీ పేరున వడ్డి జ్ఞానేశ్వరరావు, ఆషాపు పేరున కె.చిరంజీవి పరీక్షలు రాస్తున్నట్లు గుర్తించారు. పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ జీఎల్‌వీవీ లక్ష్మి ఇచ్చిన పిర్యాదు మేరకు శనివారం అర్ధరాత్రి కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై ఎస్ ముత్యాలరావు ఆదివారం చెప్పారు. హాల్ టికెట్ తనిఖీ చేస్తుండగా నలుగురు విద్యార్థుల ఫొటోలు సరిపోలకపోవడంతో వారిని ప్రశ్నించగా వేరే వారి పేరున రాస్తున్నట్లు అంగీకరించారని జీఎల్‌వీవీ లక్ష్మి చెప్పారు. తెలుగు పరీక్ష కూడా రాశామని వారు ఒప్పుకున్నట్లు తెలిపారు. తెలుగు పరీక్ష రోజు మొదటి రోజు కావడంతో ప్రశ్నాపత్రాలు సరిచూసుకోవడంలో మునిగిపోవడంతో ఈ విషయాన్ని గుర్తించలేకపోయామన్నారు. శనివారం తనిఖీలో వీరిని గుర్తించి పాఠశాలకు వచ్చిన స్క్వాడ్ బృందానికి ఈ విషయాన్ని తీసుకువెళ్లగా కేసు నమోదు చేయాలని సూచించారన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

మోటార్ సైకిళ్ల దొంగ అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిళ్లతో నిందితుడు




వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవిమనోహరాచారి


- రూ.7 లక్షల విలువైన 15 బైక్‌లు స్వాధీనం
- డీఎస్పీ రవిమనోహరాచారి వివరాలు వెల్లడి

మొగల్తూరు: జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోటార్ సైకిళ్లను దొంగలించిన నిందితుడిని అరెస్ట్ చేసి అతని నుంచి రూ.7 లక్షల విలువ చేసే 15 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కె.రవి మనోహరాచారి చెప్పారు. ఆదివారం మొగల్తూరు పోలీస్‌స్టేషన్‌లో సీఐ వి.సురేష్ బాబు, ఎస్సై ఎం.వీరబాబులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం శివకోడు పాలెంకు చెందిన యల్లమిల్లి మున్నాబాబు అనే వ్యక్తి చెడు వ్యసనాలకు అలవాటు పడి డబ్బులు సంపాదించేందుకు మోటార్ సైకిళ్లు దొంగిలిస్తున్నాడన్నారు. 2019 డిసెంబర్‌లో అంబాజీపేట పోలీసులు ఇతనిని అరెస్ట్ చేసి 30 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని జైలుకు పంపారన్నారు. 2021 ఫిబ్రవరిలో జైలు నుంచి బయటకు వచ్చి మళ్లీ మోటార్ సైకిళ్లను దొంగలించి ఎవరికీ అనుమానం రాకుండా ఉండే ప్రాంతంలో వాటిని ఉంచి అధిక ధర వచ్చినప్పుడు అమ్ముకునేవాడన్నారు. ఈ నేపథ్యంలో కేపీపాలెం తీరంలోని మేరీమాత ఉత్సవాల్లో భాగంగా శనివారం పోలీసులు బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో నిందితుడు మున్నాబాబు మోటార్ సైకిల్‌పై వేగంగా వచ్చి పోలీసులను చూసి అదుపు తప్పి కిందపడిపోయాడు. అక్కడే ఉన్న పోలీసులు అతనిని లేపే ప్రయత్నం చేస్తుండగా బండి వదిలి పారిపోయే ప్రయత్నం చేశాడు. పోలీసులకు అనుమానం వచ్చి విచారించగా పేరుపాలెం, మోళ్లపర్రులోని రిసార్ట్స్‌కు సమీపంలోని దట్టమైన సరుగుడు తోటలో మోటార్ సైకిళ్లను దాచాడు. మేరీ మాత ఉత్సవాలకు అధిక సంఖ్యలో విశ్వాసులు వస్తారని, వారి మోటార్ సైకిళ్లను దొంగలించేందుకు వచ్చి తమకు పట్టుబడ్డాడన్నారు. శనివారం సరుగుడు తోటలో దాచిన రూ.7 లక్షల విలువైన 15 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశామన్నారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ సురేష్‌బాబు, ఎస్సై ఎం.వీరబాబు, సిబ్బంది ఆర్.వెంకటేశ్వరరావు, శీలం బాబుజి, పాలా అశోక్ కుమార్, నల్లం రాజేష్‌లను ఆయన అభినందించారు.

రెండో రోజూ ఉత్సాహంగా టెక్‌జైట్–23



రోబో పనితీరు పరిశీలిస్తున్న విద్యార్థులు



సినీ గీతాలకు డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

నూజివీడు: పట్టణంలోని ట్రిపుల్ ఐటీలో నిర్వహిస్తున్న సాంకేతిక సంబరం టెక్ జైట్–23 రెండో రోజూ ఆదివారం ఉత్సాహంగా కొనసాగింది. విద్యార్థులు పలు ఈవెంట్లలో పాల్గొనడమే కాక ప్రాజెక్టు ఎక్స్‌పో సందర్భంగా పలు అంశాలపై అవగాహన పెంచుకున్నారు. వివిధ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులతో పాటు ట్రిపుల్ ఐటీకి చెందిన విద్యార్థులతో కలిసి వర్క్‌షాపును నిర్వహించారు. కోడింగ్, డీ కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) తదితర అంశాలపై క్షుణ్ణంగా వివరించారు. అంతేకాక పోటీ ప్రపంచంలో ఇంటర్వ్యూలు ఎదుర్కొనే సమయంలో ప్రదర్శించాల్సిన నైపుణ్యాలను వివరించారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే అవలంబించాల్సిన విధానాలను, ఇంజినీరింగ్ విద్యతో పాటు కంప్యూటర్, కమ్యునికేషన్ స్కిల్స్ తదితర వాటిని మరింతగా తెలుసుకున్నారు. అనంతరం టెక్ జైట్–23 వేదికపై పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఏకపాత్రాభినయం, మిక్స్‌డ్ పాటలకు డ్యాన్స్‌లు, కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు, అధ్యాపకులు, హెచ్‌వోడీలు, మెంటార్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేడినీళ్లు పోసిందని భార్యపై ఫిర్యాదు

భీమవరం అర్బన్: కుటుంబ గొడవల కారణంగా భార్య తన వీపుపై వేడినీళ్లు పోసిందంటూ ఓ భర్త పోలీసులను ఆశ్రయించాడు. వివరాలిలా ఉన్నాయి. భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దిరుసుమర్రు గ్రామానికి చెందిన పాలపర్తి సురేష్, అతని భార్య స్వాతి మధ్య కొన్నాళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం భార్య స్వాతి భర్త వీపుపై వేడినీళ్లు పోసింది. దీంతో సురేష్‌కు శరీరం కాలి తీవ్ర గాయాలు కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై డి.మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

వేసవిలో ఆరోగ్య నియమాలు పాటించాలి



తాడేపల్లిగూడెం ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ భవనంలో సమావేశమైన సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు తగు ఆరోగ్య, ఆహార నియమాలు పాటించాలని ఆయుర్వేద వైద్య నిపుణులు కంచర్ల లక్ష్మీన రసింహం సూచించారు. ఆదివారం స్థానిక ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ భవనంలో అసోసియేషన్ సర్వ సభ్య సమావేశం అధ్యక్షుడు కురుమళ్ళవెంకటాచలం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ నరసింహం మాట్లాడుతూ వేసవిలో మంచి నీటిని అధికంగా తీసుకోవాలన్నారు. నలుపు, ఎరుపు రంగు దుస్తులను ధరించరాదని, కాటన్ దుస్తులను ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి పి.కుమారస్వామి, కోశాధికారి పూతినీడి వెంకటపరమాత్మ, జిల్లా మాజీ గవర్నర్ కప్పల నరసింహ మూర్తి, జిల్లా డిప్యూటీ గవర్నర్ ప్రవా శ్రీనివాస్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

తణుకు టౌన్: దాహార్తిని తీర్చేందుకు యువత చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని తణుకు పట్టణ వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు సుద్దుల పాండు చెప్పారు. ఆదివారం తణుకు పట్టణం పాతూరులో ఆది జాంభవ యూత్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన యువతను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా చలివేంద్రంలో ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆది జాంభవ యూత్ నిర్వాహకులు కొమ్మర నానీ, గెద్దం ప్రసాద్, గెల్లా వీరేంద్రబాబు, దువ్వాపు బాలు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలతోనే భవిష్యత్తు



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ చైర్మన్ వెంకటాచారి

తాడేపల్లిగూడెం రూరల్: నూతన ఆవిష్కరణలతోనే భవిష్యత్తు ఉంటుందని తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ చైర్మన్ చింతపట్ల వెంకటాచారి అన్నారు. ఆదివారం మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను ఆయన స్వయంగా పరిశీలించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను తిలకించారు. విద్యార్థుల నూతన ఆవిష్కరణలు, ప్రాజెక్టులకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ వారి వెన్నంటి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి.రాజారావు, వైస్ ప్రిన్సిపల్ బి.ప్రతాప్, ఉపాధ్యాయులు, రాయుడు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్లు దాఖలు చేసుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): లైఫ్ సర్టిఫికెట్లు ఇంకా ఇవ్వని ప్రభుత్వ పింఛన్‌దారులు ఈ నెల 14వ తేదీలోపు సంబంధిత సబ్ ట్రెజరీ కార్యాలయంలో దాఖలు చేసుకోవాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తాడేపల్లిగూడెం అధ్యక్షుడు బి.హరికుమార్ విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ సమావేశం ఆదివారం పట్టణ కార్యాలయంలో నిర్వహించారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో జిల్లా అధ్యక్షుడిగా బి.హరికుమార్, కార్యదర్శిగా వై.వి.సత్యనారాయణ, కోశాధికారిగా వంగపండు రామ్మోహన్‌రావు ఎన్నికయ్యారు. వారిని పెన్షన్‌దారులు ఆదివారం ఘనంగా సత్కరించారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



బంగారుగూడెంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అడిషనల్ డీజీపీ

తాడేపల్లిగూడెం రూరల్: బంగారుగూడెంలో నూతనంగా ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని ఇంటిలిజెన్స్ అడిషినల్ డీజీపీ పీవీ.సునీల్‌కుమార్ ఆవిష్కరించారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ యువజన సేవా సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ బుర్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్ ఎలిపే గాంధీ, యువకులు పాల్గొన్నారు.

రేపు సబ్ స్టేషన్‌లో మరమ్మతులు

తాడేపల్లిగూడెం రూరల్: నీలాద్రిపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేపట్టనున్నట్టు తాడేపల్లిగూడెం విద్యుత్ డీఈ ఎస్.వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఈ నెల 11వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

‘జగనన్నే మా భవిష్యత్తు’కు విశేష స్పందన



అత్తిలిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు



రాచర్ల మూడో వార్డులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, గృహ సారథులు

అత్తిలి: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం అత్తిలిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇంటింటికీవెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల పనితీరుపై పలు ప్రశ్నలు వేసి సమాధానం రాబట్టారు. ఈనెల 20వ తేదీవరకు మండలంలో అన్ని గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తామని పైబోయిన చెప్పారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు పెన్మెత్స రామరాజు, బీసీ సెల్ అధ్యక్షుడు రంభ సూరిబాబు, ఉప సర్పంచ్ మద్దాల శ్రీనివాస్, ఎస్సీసెల్ అధ్యక్షుడు కోరుకొల్లు వెంకట్రావు, సోషల్ మీడియా జిల్లా కో కన్వీనర్ బుడితి సుజన్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు కంకటాల సతీష్, గంటా నాగరాజు, సబ్బితి రాజేష్, గెడ్డంకుమారి పాల్గొన్నారు. బల్లిపాడులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, సర్పంచ్ కసిరెడ్డి బాలాజీ, మాజీ సర్పంచ్ అకుల పండుస్వామి, ట్రస్టు బోర్డు చైర్మన్ ధనుమూరి తాతాజీ, తోటవెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జగన్‌పైనే ప్రజల నమ్మకం

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేస్తున్న సీఎం జగన్‌పైనే వారికి నమ్మకమని జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు అన్నారు. ఆదివారం మండలంలోని పెదతాడేపల్లిలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికారప్రతినిధి ముప్పిడి సంపత్‌కుమార్, పెదతాడేపల్లి సొసైటీ చైర్మన్ పరిమి తులసీదాస్, విజయకుమార్, పాలకోడేటి సురేష్, మోషేన్, సత్యనారాయణ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ముప్పిడి పెద్దబ్బులు రెడ్డి, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉత్సాహంగా సర్వే

తణుకు టౌన్: గ్రామాల్లో ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ పీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు చెప్పారు. రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు ఆధ్వర్యంలో నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం తణుకు రూరల్ మండలం వేల్పూరు, దువ్వ, తేతలి, మండపాక, మహాలక్ష్మీ చెరువు, యర్రాయి చెరువు, ముద్దాపురం, కోనాలలో నిర్వ హించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీఎస్ కన్వీనర్ కరిబండి రాజేష్, గృహ మిత్రలు, గ్రామసచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు సచివాలయాల పరిధిలోని ఇంటింటికి వెళ్లి వారికి ప్రభుత్వం ద్వారా కలిగిన లబ్ధి వివరించారు. ఎంపీపీ రుద్ర ధనరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, దువ్వ గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, ఉప సర్పంచ్, నాయకులు ముళ్లపూడి బాబూరావు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహ మిత్రులు, తేతలి గ్రామంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, రైతు విభాగం ప్రధాన కార్యదర్శి సరెళ్ల కృపావరం, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్ మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, నాయకులు రామకృష్ణంరాజు, కోట స్వామీజీ, సరెళ్ల సతీష్, బీమ చంద్రా వు, పూర్ణ, దారం శ్రీను పాల్గొన్నారు. మండపాకలో ఎంపీటీసీ సభ్యులు కాళ్ల సన్యాసిరావు, సొసైటీ అధ్యక్షురాలు వై విజయమూర్తి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్ పాల్గొన్నారు.

వేల్పూరులో...

మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం తణుకు రూరల్ మండలం వేల్పూరులోని 10వ వార్డులో ఆదివారం నిర్వహించారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీ సభ్యులు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న ద్వారానే పథకాల లబ్ధి

పెంటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు పార్టీ కార్యకర్తలు గృహసారథులు ఆదివారం పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు రాచర్లలో పార్టీ బీసీ సంఘ నాయకులు వాకా వెంకట సుబ్బారావు, పెంటపాడులో పార్టీ కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పెంటపాడు ఉప సర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు భాస్కరరెడ్డి, పృథ్వీకుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు. రాచర్లలో సర్పంచ్ వాకా దుర్గాభవాని, ఎంపీటీసీ సభ్యురాలు చింతన శారద, పార్టీ నాయకులు నారాయణరావు, మాజీ సర్పంచ్ డోకుల కమలాకర్ గృహసారథులు, వలంటీర్లు, మజ్జి శ్రీను, బ్రహ్మాజీ, కె. రాజేష్, జి. రాజేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

వాడవాడలా జగనన్నే మా భవిష్యత్తు

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం జగన్ కార్యక్రమం పండుగను తలపిస్తోంది. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు వార్డు ఇన్‌చార్జుల ఆధ్వర్యంలో గృహసారథులు, వలంటీర్లు, కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు.ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి శీలి వెంకటేశ్వరరావుతోపాటు పార్టీ కనీ వ్వనర్లు కావల నాగరాజు, జాలాది పద్మజ, ఎరగోగుల శ్రీను, జాలాది జగ్జీవన్ పాల్గొన్నారు.

వెంకట్రావుపాలెంలో..

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వెంకట్రావుపాలెంలో ఆదివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎలిపేగాంధీ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించారు. గృహసారథులు, వలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను బలపర్చాలి



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కొట్టు సత్యనారాయణ



తణుకులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ బ్రోచర్ అందిస్తున్న మంత్రి కారుమూరి

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: రాబోయే 2024 ఎన్నికల్లోనూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి బలపర్చి, గెలిపించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆదివారం తాడేపల్లిగూడెం మండలం దండగర్రలో గడపగడపకు మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ 14 ఏళ్ల పాటు సీఎంగా ఉన్నానని చెబుతున్న చంద్రబాబు అర్హులకు ఒక్క ఇంటి స్థలం ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ఏనాడూ ఇచ్చిన మాట ఆయన నిలబెట్టుకోలేదని విమర్శించారు. పీఆర్పీ కాంగ్రెస్‌లో విలీనమైన ఏడాదిలోపు జనసేన పార్టీని పవన్ కల్యాణ్ ప్రారంభించారన్నారు. ప్రశ్నిస్తానన్న వ్యక్తి 2014 ఎన్నికల్లో చంద్రబాబుకు వత్తాసు పలికి గెలిపించాడని దుయ్యబట్టారు. పవన్‌పై ప్రజలకు విశ్వాసం లేదన్నారు. చంద్రబాబుతో ఉంటే పవన్‌కు రాజకీయ భవిష్యత్తు ఉండదన్నారు. మాట తప్పే వ్యక్తి చంద్రబాబు అయితే, జగన్ ఇచ్చిన మాట కట్టుబడే వ్యక్తి అని కొనియాడారు. జగన్ హయాంలో అన్నివర్గాలకు న్యాయం జరిగిందన్నారు. వ్యవసాయ రంగానికి పెద్ద ఎత్తున సాయం అందించారన్నారు. దండగర్ర ఎంతో రాజకీయ చైతన్యం కలిగిన గ్రామమని, ప్రజలు ఆలోచన చేసి, 2024 ఎన్నికల్లో జగన్‌ను బలపర్చాలని కోరారు. సర్పంచ్ పిల్లా రాంబాబు, ఎంపీటీసీలు వీరమళ్ళ వెంకన్న, మార్లపూడి సుబ్బారావు, తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వీఎస్.వేణుగోపాల్, ఏపీవో ఏవీవీఎస్వీ.ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ వైవీ వెంకట్రావు, పంచాయతీ ఈవో శ్రీనివాసరాజు, పంచాయతీ కార్యదర్శి అంకం శ్రీరామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, వెలిశెట్టి నరేంద్రకుమార్, ముప్పిడి పెద్దబ్బులు రెడ్డి, సంపతరావు కృష్ణారావు, బొద్దాని శ్రీనివాస్, ముద్రగడ లలితకుమారి, యాతం సత్యనారాయణ (పెద్దోడు), చిక్కాల సత్యనారాయణ, ములగాల గంగారావు, ములగాల శ్రీనివాస్, గట్టి సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, వలంటీర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవినీతిరహిత పాలనకు జనం నీరాజనాలు : కారుమూరి

2వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

తణుకు అర్బన్: అవినీతి రహిత పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలు నీరాజనాలు పడుతున్నారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు అన్నారు. తణుకు 2వ వార్డులో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి కారుమూరి పాల్గొని మాట్లాడారు. ప్రజలకు అందాల్సిన ప్రతి సంక్షేమాన్ని పారదర్శకంగా మహిళల ఖాతాలకే జమ చేస్తూ వారి మన్ననలు పొందుతున్నారని అన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా రూపాయి కూడా ఎవ్వరికీ ఇవ్వాల్సిన పని లేకుండా వలంటీరు వ్యవస్థతో అందిస్తున్న తీరును ప్రజానీకం స్వాగతిస్తున్నారని స్పష్టం చేశారు. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజల్ని టీడీపీ నాయకులు జలగల్లా రక్తం పీల్చేశారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమాన్ని నేరుగా ప్రజలకు అందిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా స్థానికులు తెలిపిన సమస్యలను పరిష్కరించాల్సిందిగా మంత్రి కారుమూరి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కేటీ సుధాకర్, డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షులు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, కర్రి కాశీరెడ్డి, పోతుల సోమేశ్వరరావు, సంగిరెడ్డి శ్రీనివాస్, రంభ నాగేశ్వరరావు, పెంటా నరేష్, సందాపు దుర్గారావు, కర్రి గంగాధర అప్పారావు, ములగాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఈస్టర్ ప్రార్థనలు



పోలీస్ ఐలండ్ వద్ద కొవ్వొత్తులతో ప్రార్థనలు

ఇరగవరం: వాడవాడలా ఈస్టర్ పండుగను క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం తెల్లవారు జామున సమాధుల వద్దకు వెళ్లి వాటిని అలంకరించి కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇరగవరం, గోటేరు, కంతేరు, పేకేరు, ఏలేటిపాడు, కె ఇల్లిందలపర్రులోని చర్చిల్లో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. రాపాకాలో యెహోవా స్వస్థత శాల ప్రార్థన మందిరంలో ఈస్టర్ వేడుకల్లో రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు బూసి వినీత నక్కా సుజాత పాల్గొన్నారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

తణుకు టౌన్: ఈస్టర్ వేడుకలను ఆదివారం తణుకు మండలంలోని వివిధ చర్చిలలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశ్వాసులు ఆదివారం తమ పూర్వీకుల సమాధులను సుందరంగా అలంకరించి ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం చర్చిలలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. తణుకులోని ఆర్‌సీఎం చర్చి, లూథరన్ చర్చి, జీడీఎం అసెంబ్లీ, పెంతుకోస్తు, వేల్పూరులోని సెయింట్ పాల్స్ లూథరన్ చర్చి, దువ్వలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

శాంతికోసం కొవ్వొతుల ర్యాలీ

పెంటపాడు: గూడెం నియోజకవర్గంలోని ఈస్టర్ సందర్భంగా చర్చిలలో ఆదివారం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి విశ్వాసులు తమ పూర్వీకుల సమాధులను దర్శించి వాటిని శుభ్రంచేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించి, కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేసారు. గూడెం ప్రాంతంలోని పెంటపాడు, గూడెం మండలం పలు క్రైస్తవ శ్మశాన వాటికలలో తెల్లవారు జామున ప్రార్థనలు చేసారు. గూడెం పాతూరు క్రైస్తవ శ్మశాన వాటిక వద్ద ప్రార్థనలు చేసారు. చర్చిలో ఏఈఎల్‌సీ క్రిష్టియన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ టి.జయప్రకాష్ ఈస్టర్ సందేశం అందించారు. సంఘ గురుమండల అధ్యక్షుడు విజయరాజుతో పాటు, ఆయనను చర్చి పాలకవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. కొండాయి చెర్వు ప్రాంతంలోని రాష్ట్ర పాస్టర్ల సంఘ నాయకులు జీజే జ్యోతి ఆనంద్, సుస్మిత ఆనంద్ ఆధ్వర్యంలో ఈస్టర్ ప్రార్థనలు నిర్వహించారు. గూడెం బైబిలుమిషను మందిరాలైన దేవేష్టమ్, హనోక్, కల్వరి చర్చి, కొండాయి చెర్వు, సీతారాం పేట తదితర ప్రాంతాలకు చెందిన విశ్వాసులు గూడెం పోలీస్ ఐలాండ్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసారు. బాదంపూడి స్వస్థత శాల, గూడెం భాగ్యలక్ష్మిపేటలోని ఎల్ఎల్ఎం విమోచన పరిచర్య ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. పాస్టర్ల సంఘ నాయకులు మల్లిపూడి జైబాబు పాల్గొన్నారు.

సోమాలమ్మ ఆలయం వద్ద అన్నసమారాధన



అత్తిలిలో సోమాలమ్మ ఆలయంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావుని సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

అత్తిలి: ఉగాది ఉత్సవాలను పురస్కరించుకుని అత్తిలి సోమాలమ్మవారి ఆలయం వద్ద ఆదివారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు హాజరై భక్తులకు అన్న ప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా సోమాలమ్మ అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేసారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాయిబాబాకు పూజలు

తణుకు అర్బన్: స్థానిక 17వ వార్డులోని శ్రీరామ సాయి మందిరంలో శ్రీరామనవమి, షిర్డీ సాయిబాబా విగ్రహ 23వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంత్రి కారుమూరికి ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, మండ సూరిబాబు, కట్టా కిషోర్, అన్నారి సత్యనారాయణ, వైవీ సత్యనారాయణ, రేలంగి రాంబాబు పాల్గొన్నారు.

తిరుపతి ఇప్టూ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

తాడేపల్లిగూడెం రూరల్: తిరుపతిలో ఈ నెల 16, 17, 18వ తేదీల్లో నిర్వహించనున్న ఇప్టూ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా నాయకుడు మామిడి దానవరప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం జగన్నాథపురంలో ఇప్టూ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మామిడి దానవరప్రసాద్ మాట్లాడుతూ 16న భారీ ర్యాలీ, 17, 18వ తేదీల్లో ఇప్టూ ప్రతినిధుల సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇప్టూ డివిజన్ ఉపాధ్యక్షుడు తులా దుర్గారావు, తీపర్తి సత్యనారాయణ, యడ్లపల్లి ప్రసాద్, ఉప్పు సుబ్బారావు, మంచాల శ్రీను, అయినం వెంకటేశ్వర్లు, ఎస్.పుల్లయ్య, దాన య్య, పొక్కిరాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో అన్నివర్గాల ప్రజలకూ లబ్ధి



అత్తిలి అరుంధతీపేటలో వైఎస్సార్‌సీపీ నాయకుల సమక్షంలో పార్టీలో చేరిన స్థానికులు

అత్తిలి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతోందని పార్టీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. అత్తిలి శివారు అరుంధతీపేటలో ఆదివారం పలువురు మహిళలు, యువకులు, పెద్దలు వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా పైబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 5న అరుంధతీపేటలో ఏర్పాటుచేసిన బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే అరుంధతీపేటకు చెందిన యువత, మహిళలకు పార్టీ కండువాలు కప్పి పార్టీలో చేరినట్లు ప్రకటించుకున్నారన్నారని విమర్శించారు. జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమానికి హాజరైన స్థానికులకు పార్టీ కండువాలు కప్పి, తెలుగుదేశంలో చేరారంటూ ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు, యువత మాట్లాడుతూ తామంతా వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులమని, జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమానికి వచ్చిన తమకు టీడీపీ నాయకులు పార్టీ కండువాలు కప్పారని తెలిపారు. ఈసందర్భంగా వీరంతా వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్ధరాతి భరణీ ప్రసాద్, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు రంభ సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు చిటకన వెంకట్రావు, పెచ్చెట్టి రామకృష్ణ, గంటా నాగరాజు, సబ్బితి రాజేష్, గెడ్డం కుమారి, కంకిపాటి రత్నరాజు, జి జేమ్స్, కె ఒత్నియేలు, ఎం నెల్సన్, వై సామ్యేల్, జి సునీల్, కె అనిల్, వై సాగర్, కె సునీత, కె ప్రశాంతి, మెర్సి, జి మరియమ్మ పాల్గొన్నారు.